హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 15.4

ప్రజలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు



రాష్ట్రంలో నియంత పాలన పోయి ప్రజా పాలన వచ్చింది. తెలంగాణ ప్రజలకు చీకటి తొలగి వెలుగు వచ్చింది. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తాం. కొత్త సంవత్సరంలో మరిన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడతాం. సరికొత్త లక్ష్యాలతో అన్నింట్లో విజయం సాధించాలి. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరి సంపదలతో ప్రశాంతంగా జీవించాలి. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాష్ట్ర ప్రజలందరికీ న్యూఇయర్ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు.

● రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి కాంగ్రెస్ అధికారంలోకి రాగా, కొత్త సంవత్సరంలో ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రజాదర్బార్‌తో ప్రారంభమైన కాంగ్రెస్ పాలనలో కొత్త ఏడాదిలో హామీల అమలుతోపాటు ఆకాంక్షలను నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

\- కోదాడ

కొత్త సంవత్సరంలో కోటి ఆశలతో..

» రూ.3,500కోట్ల రుణమాఫీ కోసం రైతుల ఎదురుచూపు

» పన్నుల సవరింపు కోసం వ్యాపారులు..

» కనీస వేతన చట్టం కోసం అసంఘటితరంగ కార్మికులు

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండలో 216 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, యాదాద్రి జిల్లాలో 98, సూర్యాపేట జిల్లాలో 142 మొత్తం 456 బ్యాంకులు ఉన్నాయి. కాగా, ఆయా బ్యాంకుల్లో రైతులు రూ.2లక్షల లోపు రుణాలు రూ.3,500కోట్ల మేర తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీ చేస్తానని హామీఇవ్వటంతో రైతులు దీనికోసం ఎదురుచూస్తున్నారు.

ఖాళీగా ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులు



నూతన ప్రభుత్వం మెగా డీఎస్సీతో పాటు, ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పడంతో నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది. ఇప్పటికే గత ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 86, ఎస్జీటీ 102, లాంగ్వేజీ 25, పీఈటీ 25 పోస్టులకు, సూర్యాపేట జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 80, ఎస్జీటీ 78, లాంగ్వేజీ 23, పీఈటీ 4, యాదాద్రి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 39, ఎస్జీటీ 38, లాంగ్వేజీ 20, పీఈటీ 20 పోస్టు లు మొత్తంగా 403పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఎస్జీటీ పోస్టులకు బీఈడీ విద్యార్థులు అర్హులు కాదని డీఎడ్ విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో ఈ నియామక ప్రక్రియ నిలిచింది. దీంతో సాంకేతిక సమస్యలను తొలగించి, పోస్టుల సంఖ్య పెంచి కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో బీఎడ్, ఎంబీఏ, ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలలు 2,910 ఉండగా, ఆయా కళాశాల నుంచి ఏటా 16,286మంది విద్యార్థులు పట్టాతో బయటకు వస్తున్నారు. ఈ క్రమంలో ఖాళీలను భర్తీచేయాలని నిరుద్యోగ యువత కోరుతోంది.

నెరవేరని సొంతింటి కల



బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గృహలక్ష్మీ పథకాన్ని ఎన్నికల ముందు తీసుకువచ్చింది. సొంత స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు మంజూరు చేస్తామని దరఖాస్తులు తీసుకుంది. అయితే కాంగ్రెస్ ఈ మొత్తాన్ని రూ5లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఇప్పటికే 36వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకాన్ని కొత్త ప్రభుత్వం అమలుచేయాలని అర్హులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో అమలుకాని 'దళితబంధు'

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలలో గత ప్రభుత్వ హయంలో 13వేల మంది దళిత బంధుకోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మారడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఉచిత విద్యుత్, ధర

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా 200యూనిట్లలోపు విద్యుత్ బిల్లు ఎత్తివేసి గృహ వినియోగదారులకు లబ్ధిచేకూర్చాల్సి ఉంది. వరి, కందులు, ఇతర పంటలకు మద్దతు ధర ప్రకటించి యాసంగిలో ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పన్నులు తగ్గిస్తే వస్తువు ధర తగ్గుతుందని, ఫలితంగా విక్రయాలు పెరిగే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని, ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని అసంఘటితరంగ కార్మికులకు కోరుతున్నారు.

విడుదల కాని ఉపకార వేతనాలు

ఉమ్మడి జిల్లాలో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 2021-22, 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.80కోట్ల ఉపకార వేతనాలు పెండింగ్ ఉన్నాయి. ఈ విద్య సంవత్సరంలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థికి సంబంధించిన మొదటి ఏడాది బకాయి నేటికీ విడుదల కాలేదు. అంతేగాక 2023-24 విద్య సంవత్సరానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉంది. పాత బకాయిలు విడుదల చేయకపోవటంతో విద్యార్థులకు సర్టిఫికెట్ ఇచ్చేప్పుడు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతుండటంతో పైచదువులకు దూరమవుతున్నారు. నూతన ప్రభుత్వం ఉపకార వేతనాలను విడుదల చేస్తుందని విద్యార్థులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

నిలిచిన పదోన్నతులు, బదిలీలు

ఉపాధ్యాయులకు పదేళ్లుగా పదోన్నతలు, ఆరేళ్లుగా బదిలీలు లేకపోవడంతో బోధన కుంటుపడుతోందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఈనెల 11న సీఎంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతోపాటు, ఉన్నత విద్యాశాఖ అధికారులు సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో పదోన్నతులు, బదిలీలపై స్పష్టతకు వస్తే ఉపాధ్యాయుల్లో ఉత్సాహం నిండుతుంది.

కొలనుపాకను అభివృద్ధి చేస్తాం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, డిసెంబరు 31: చారిత్రక నేపథ్యం కలిగిన మేజర్ పంచాయతీ కొలనుపాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కొలనుపాకలోని వంతెనను ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో వంతెన నిర్మాణం కోసం రూ.14. 50కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే వంతెన పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ సీఈ మోహన్ నాయక్, ఈఈ శంకరయ్య, ఏఈ భరత్, ఎస్ఐ రాజేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ ఆరె ప్రశాంత్, సర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీర్ల

● న్యూఇయర్ సందడి



నూతన సంవత్సరం సందర్భంగా భువనగిరిలోని ఓ బేకరిలో కేక్ కొనుగోళ్ల సందడి

మూడు రోజుల్లో 3.02లక్షలు

● 'ప్రజాపాలన'లో వెల్లువెత్తిన దరఖాస్తులు

● రేపటి నుంచి తిరిగి దరఖాస్తుల స్వీకరణ

● పాత లబ్ధిదారులకు యథావిధిగా పథకాలు

భువనగిరి అర్బన్, నల్లగొండ, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు సంబంధించి స్వీకరిస్తున్న దరఖాస్తులు మూడు రోజుల్లో 3లక్షలకు పైగా వచ్చాయి. గత నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న విషయం విదితమే. ఆది, సోమవారం సెలవు ఉండటంతో 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఐదు రోజుల పాటు 'ప్రజాపాలన'లో భాగంగా ఇందిరమ్మ అభయహస్తానికి సంబంధించిన దరఖాస్తులను అధికారులు తీసుకోనున్నారు. దరఖాస్తులను అంచనా వేయడంలో కొంత సమస్య ఏర్పడటంతో పలుచోట్ల దరఖాస్తుల కొరత ఏర్పడింది. దీంతో ఆయా గ్రామాల్లో మళ్లీ దరఖాస్తులు తీసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గతంలో రైతుబంధు, పింఛన్లు పొందుతున్నవారు దరఖాస్తు చేయాలా వద్దా అనే సందేహంలో ఉండగా, వారికి యథావిధిగా పథకాలు అమలవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎలాంటి పథకాలు అందని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో గందరగోళానికి తెరపడింది. దీంతో 2వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లో 3,02,311 దరఖాస్తులు వచ్చాయి. నల్లగొండ జిల్లాలో 1,34,438 దరఖాస్తులు రాగా, సూర్యాపేట జిల్లాలో 1,00,792, జిల్లాలో 67,081 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో తొలి రోజు 51గ్రామ సభల్లో 11,132 దరఖాస్తులు రాగా, రెండో రోజు 72 గ్రామ సభల ద్వారా 20,475, మూడో రోజు 65గ్రామ సభల ద్వారా 35,474 దరఖాస్తులు వచ్చాయి.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్, డిసెంబరు31: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో వరుస సెలవుదినాలతోపాటు సంవత్సరాంతంకావడంతో పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి నూతన సంవత్సర వేడుకలు సాగర్‌లో జరుపుకోవడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో సాగర్‌కువచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, విజయవిహార్, అనుపు, ఎత్తిపోతల తదితర ప్రాంతాలల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు హిల్ కాలనీ విజయవిహార్ అతిథి గృహం వెనుక వైపున ఉన్న పర్యాటకశాఖ లాంచీ స్టేషన్ నుంచి మూడు లాంచి ట్రిప్పులు నడిపినట్లు అధికారులు తెలిపారు.

స.హ చట్టంపై ప్రచారం చేపట్టాలి

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 31: సమాచారం హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహించాలని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు అన్నారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగం, పాలనలో పారదర్శకత వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు.

కేక్‌కోసం వెళ్లి కానరాని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

మఠంపల్లి, డిసెంబరు 31: కేక్‌కోసం వెళ్లిన ఓ విద్యార్థిని కానరాని లోకాలకు వెళ్లింది. వివరాల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన గాయం మధుసుధన్‌రెడ్డి మల్లేశ్వరీ దంపతుల కుమార్తె గీతారెడ్డి(14). చిన్నపట్టినుంచే తాతయ్యానాయనమ్మలు వద్ద ఉంటూ చదువుకుంటోంది. గీతారెడ్డి మఠంపల్లి మాన్‌పోర్టు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గీతారెడ్డి ఆదివారం న్యూ ఇయర్ వేడుకలకు కేక్ తెచ్చుకుందామని తాత, సోదరుడు గోపిరెడ్డితో కలిసి రాత్రి ద్విచక్రవాహనంపై మఠంపల్లికి బయలుదేరారు. చౌటపల్లి-ప్రధాన రహదారిపై నుంచి మఠంపల్లి వైపు వస్తున్న వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి లారీ అతివేగంగా ఢీ కొట్టడంతో రోడ్డుపై గీతారెడ్డి, రోడ్డు పక్కన కృష్ణారెడ్డి, గోపిరెడ్డి పడ్డారు. ప్రధాన రహదారిపై పడిన గీతారెడ్డిపై నుంచి ఢీకొన్న లారీ టైర్లు వెళ్లడంతో శరీర భాగం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గీతారెడ్డి(ఫైల్)

అంబరాన్నంటిన సంబురాలు

● వెల్‌కమ్ టు 2024 ● బాణాసంచాల మోత ● జోష్‌లో యువత ● కేక్ కటింగ్‌లు, స్వీట్ల పంపిణీ ● చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ● నేడు భక్తులతో కిటకిటలాడనున్న దేవాలయాలు





నల్లగొండలో బేకరీల్లో, రంగుల దుకాణం వద్ద వినియోగదారుల రద్దీ



భువనగిరిలో మద్యం దుకాణం వద్ద..



హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్.. విష్యూ హ్యాపీ న్యూ ఇయర్.. అంటూ జరిపిన వేడుకలు జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. చిన్న పిల్లల నుంచి మొదలుకుని పెద్దలవరకు శనివారం అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. గత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ గడచిన సంవత్సరం విశేషాలను నెమరు వేసుకుంటూ రాబోయే సంవత్సరం హ్యాపీగా గడవాలని కాంక్షిస్తూ సంబురాలు చేసుకున్నారు.

నల్లగొండ కల్చరల్, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి

కోటి ఆశల కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. న్యూ ఇయర్ కేకును కట్ చేసి స్వీట్లను పంచుకుంటూ వినోదాలతో సరదాగా ఆనందంగా గడిపారు. అర్ధరాత్రి కాగానే నల్లగొండ జిల్లాకేంద్రంలోని వివిధ పార్టీ కార్యాలయాలు, అధికారుల బంగ్లాలు, ఇళ్లలో న్యూఇయర్ వేడుకలు అంబరాన్ని తాకాయి. యువకులు ద్విచక్ర వాహనాల మీద పట్టణంలో తిరుగుతూ హ్యాపీ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ స్నేహితులను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపి సరదాగా గడిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో న్యూఇయర్ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరిపారు. కలెక్టర్ బంగ్లాలో ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కుటుంబసభ్యులు, ఇతర రెవెన్యూ అధికారులు, ఎస్పీ బంగ్లాలో ఎస్పీ తన కుటుంబసభ్యులతో, పోలీసు అధికారులతో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకులను కట్ చేసి స్వీట్లను పంచుకుని ఆటపాటలతో గడిపారు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల గృహాల్లో తమ కార్యకర్తలతో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరిగాయి. అదే విధంగా పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో గల స్వపోషణ తెలుగు బాప్టిస్టు చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్యాండిల్స్ వెలిగించి న్యూ ఇయర్ వేడుకలను జరిపారు. భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా మిషన్ కాంపౌండ్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో కూడా వేడుకలు జరిగాయి. దేవరకొండ రోడ్‌లోని మరియరాణి కెథెడ్రల్ చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఇళ్ల ముంగిట న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ వివిధ రంగులతో అందంగా ముగ్గులు వేశారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు మధ్య రాత్రి వరకు అనుమతించటంతో సందడిగా మారాయి. అమ్మకాలు ముమ్మరంగా సాగాయి. మందు ప్రియులకు, రెస్టారెంట్లు, బార్లు తెరిచి ఉండడంతో వారు ఎంజాయ్ చేశారు. పట్టణ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ తిరుగుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని బేకరీల యజమానులు ప్రత్యేక ఆఫర్లు ఇవ్వటంతో ప్రజలు వాటిని భారీగా అమ్మకాలు చేశారు. వివిధ రంగులను కూడా షాపుల యజమానులు భారీగానే అమ్మారు. పట్టణమంతా విద్యుత్ కాంతులతో విరాజిల్లుతూ కొత్త సంవత్సరానికి శోభనిచ్చే విధంగా స్వాగతం పలికింది. న్యూ ఇయర్ సందర్భంగా సోమవారం దేవాలయాలు భక్తులతో సందడి చేయనున్నాయి.

సందడిగా మారిన పల్లెలు

2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వివిధ వర్గాల ప్రజలు ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు ఆదివారం (డిసెంబర్ 31న) ఉత్సాహంతో సందడిచేశారు. మోత్కూరు మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో కొత్త సంవత్సరం సందర్భంగా విందులు, వినోదాలతోపాటు కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపేందుకు కేక్‌లు కొనుగోలు చేయడంతో బేకరీల్లో న్యూఇయర్ కేక్‌ల అమ్మకాలు జోరుగా సాగాయి. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో సైతం న్యూ ఇయర్ వేడుకలపై ఉత్సాహం చూపుతున్నారు. ఆదివారం రాత్రి విందులు, వినోదాలతో అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండి 12 దాటగానే కేక్‌కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విక్రయాలు పెంచుకునేందుకు బేకరి యాజమానులు కేక్‌ల ధరలు తగ్గించి ఆఫర్లు ప్రకటించారు.

జోరుగా మాంసం విక్రయాలు



2023 సంవత్సరానికి వీడ్కోలు, 2024 సంవత్సరానికి స్వాగతం పలికేందుకు చిన్నా, పెద్దా తేడా లేకుండా విందులు చేసుకోవడంతో ఆదివారం మోత్కూరులో మద్యం, మాంసం, చికెన్ విక్రయాలు జోరుగా సాగాయి. మటన్, చికెన్ షాపుల్లో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. ఆయా షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.



భువనగిరిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు



నల్లగొండలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న యువతులు

యాదగిరిక్షేత్రంలో భక్తుల కోలాహలం

● సందడిగా ఆలయ తిరువీధులు..సేవా మండపాలు ● కిటకిటలాడిన ఉభయ దర్శన క్యూలైన్లు



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకారంలో స్వామివారు

యాదగిరిగుట్ట, డిసెంబరు31: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం యాత్రాజనుల కోలాహలం నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా దేవదేవుడి దర్శనాల కోసం తరలివచ్చారు. భక్తజనుల హరిహరుల నామస్మరనలతో క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరిసింది. ఆలయ తిరువీధులు, ఆర్జిత సేవా మండపాలు భక్తనులతో కోలాహలంగా కనిపించాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లు, ప్రసాదాల విక్రయశాల వద్ద క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉభయ దర్శనాల క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచివుండి కొండగుహలో కొలువైన ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. స్వామివారి ధర్మదర్శనాలలో సుమారు 3గంటలు..ప్రత్యేక దర్శనాలలో గంట సమయం పట్టిందని, సుమారు 35 వేల మంది భక్తులు దేవదేవుడిని దర్శించుకున్నట్టు, ఆలయియ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.42,00,353 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు. యాదగిరిక్షేత్రంలో ఆదివారం స్వామికి నిత్యారాదనలు, దనుర్మాసోత్సవాలు ఆగమ శాస్త్రరీతిలో ఘనంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన ఆచార్యులు గర్భాలయంలోని స్వయంభువులను, ప్రతిష్ఠా అలంకారమూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసి దళాలతో అర్చనలు జరిపారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

యాదగిరీశుడిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి వినోద్‌కుమార్, విజయసేన్‌రెడ్డిలు వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ వేళల్లో మార్పు

ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ సోమవారం రోజున భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించనున్నారని, ఇందుకోసం ఆలయ వేళల్లో మార్పులు చేస్తున్నట్టు ఈవో రామకృష్ణారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అరగంట ముందుగానే ఉదయం 3గంటలకు ఆలయాన్ని తెరిచి నిత్య పూజా కైంకర్యాలు నిర్వహిస్తారని, ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు స్వామికి సేవోత్సవాలు, నివేదనలు, బ్రేక్ దర్శనాల సమయాలను మినహాయించి మిగతా సమయాల్లో భక్తులందరికీ ఉభయదర్శనాల సౌకర్యం కల్పించనున్నట్టు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన నిందితుల అరెస్టు

నిడమనూరు, డిసెంబరు 31: అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురు వ్యక్తులు చనిపోవడానికి కారణమైన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా హాలియా సీఐ గాంధీనాయక్, నిడమనూరు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు. డిసెంబరు 24న మండలంలోని వేంపాడ్ స్టేజీ సమీపంలో టాటా ఏస్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అందులో ఉన్న పెద్దవూర మండలం మల్లెవానికుంట తండా, పుల్యాతండాలకు చెందిన నలుగురు వ్యక్తులు రమావత్ గన్యా, బుజ్జి, నాగరాజు, పాండునాయక్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై నిడమనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ప్రమాదానికి కారణమైన లారీ యజమాని ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన తోట దుర్గారావు, గోకవరం మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన డ్రైవరు కలిశెట్టి శ్రీను, గోకవరం మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన క్లీనర్ పేరారపు జయప్రకాష్ నిందితులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్లీనర్ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే లారీ నడిపినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవరు లైసెన్స్ కూడా వాలిడిటీ ముగిసినట్లు తెలిపారు.


ప్రయాణికుడి బ్యాగు నుంచి చోరీ



బ్యాగును చూపుతున్న హరికిషన్

మోత్కూరు, డిసెంబరు 31: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుని బ్యాగు నుంచి రూ.40 వేలు చోరీకి గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుని కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం సీతారాంపురం గ్రామ రేషన్ డీలర్ గుండు హరికిషన్ శనివారం (డిసెంబరు 30న) మధ్యాహ్నం హైదరాబాదు నుంచి మోత్కూరు రావడానికి ఉప్పల్ రింగ్‌రోడ్డులో బస్‌స్టాప్ వద్ద యాదగిరిగుట్ట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు (టీఎస్30 9119) ఎక్కాడు. బస్ ఎక్కేటప్పుడు ఆయన బ్యాగు భుజానికి తగిలించుకుని వీపునకు ఉండేలా పెట్టుకున్నాడు. మోత్కూరులో బస్సు దిగుతుండగా ఓ ప్రయాణికుడు తన బ్యాగు కట్ చేసి ఉందని చెప్పడంతో బ్యాగుతెరిచి చూస్తే అందులోని రూ.40వేలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దీంతో ఆయన ఆదివారం ఉదయం మోత్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ధర్మేందర్‌రెడ్డికి డాక్టరేట్



నల్లగొండ, మోత్కూరు, డిసెంబరు 31: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని దాచారం గ్రామానికి చెందిన నేవూరి ధర్మేందర్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహణ, అమలు తీరుపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. నేవూరి ధర్మేందర్‌రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్వీ రాష్ట్ర యువజన విభాగ నాయకుడిగా పని చేస్తున్నారు. ధర్మేందర్‌రెడ్డికి డాక్టరేట్ రావడంపై వారి కుటుంబసభ్యులు, గ్రామస్థులు, మిత్రులు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 31: తమిళనాడులోని వెల్లూర్‌లో డిసెంబరు 25 నుంచి 30వ తేదీ వరకు జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి చెస్ పోటీల 14ఏళ్ల బాలిక విభాగంలో తెలంగాణ విద్యార్థిని (రంగారెడ్డి జిల్లా)శివంశిక ఆరు పాయింట్లు సాధించి బంగారు పతకం సాధించడం పట్ల ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రాంరెడ్డి, తెలంగాణ జట్టు కోచ్, మేనేజర్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కోసనం కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం తెలిపారు. అండర్-19 బాలికల విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన దివ్యభవాని తృతీయ స్థానంలో నిలిచిందని తెలిపారు.

కబడ్డీ పోటీల కోఆర్డినేటర్‌గా రాజు

నిడమనూరు, డిసెంబరు 31: కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఈ నెల 7 నుంచి నిర్వహించనున్న అండర్-17 బాలుర, బాలికల జాతీయస్థాయి కబడ్డీ పోటీల టెక్నికల్ కోఆర్డినేటర్‌గా నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుంభం రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కబడ్డీ పోటీలకు ఆయన సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లారీ నుంచి పడిన ఐరన్ పైపులు

గరిడేపల్లి, డిసెంబరు 31: సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో ఆదివారం రాత్రి ప్రమాదం తప్పింది. కోదాడకు చెందిన లారీ కర్నాటక నుంచి ఐరన్ పైపులలోడుతో విజయవాడకు వెళ్తుంది. గరిడేపల్లి మండల కేంద్రంలోని మిర్యాలగూడ, కోదాడ ప్రధాన రహదారిపై చౌరస్తా వద్దకు రాగానే యూటర్న్ వద్ద ఆటో అడ్డు రాగా లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో లారీకి కట్టిన తాడు తెగిపోయి లారీలో ఉన్న ఐరన్ పైపులు రోడ్డు మొత్తం పడిపోయాయి. లారీ వెనకాల నుండి బైక్‌లు కానీ, ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. పైపులు రోడ్డుపై పడడంతో ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. ఘటన జరిగిన వెంటనే పోలీసులు అప్రమత్తమై రోడ్డుపై పడిన ఐరన్ పైపులను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఎవరూ లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కమ్మేసిన మంచు.. ఇబ్బందిపడిన వాహనదారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం పూట రెండు గంటల పాటు జాతీయ రహదారితోపాటు ప్రధాన వీధుల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాదచారులతోపాటు వాహనదారులు భయం..భయంగా వెళ్లాల్సి వచ్చింది. లైట్లు వేసుకున్నా కూడా వాహనాలకు రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది.

● చౌటుప్పల్ టౌన్, నల్లగొండ





నల్లగొండ, చౌటుప్పల్‌లో వాహనాల లైట్ల వెలుతురులో ప్రయాణిస్తున్న వాహనదారులు

బాధితురాలికి సెల్ ఫోన్ అప్పగింత

భువనగిరి రూరల్, డిసెంబరు 31: సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్న మహిళకు ఆదివారం అప్పగించినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. కేరళకు చెందిన ఆర్యసతీష్ బీబీనగర్ ఎయిమ్స్ వద్ద విధులు నిర్వహిస్తూ ఆర్‌టీవో ఆఫీసుకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఆమె భువనగిరి శివారులోని అనంతారం వద్ద తన ఫోన్‌ను పోగొట్టుకున్నారు. వెంటనే భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గతనెల 7న ఫిర్యాదు చేశారు. అయితే ఆమె మొబైల్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా ఫోన్ ఆచూకీని కనిపెట్టి ఆమెకు అందజేశారు. అయితే ఫోన్ ఆచూకీ కోసం కృషి చేసినా కానిస్టేబుళ్లు ఎస్ నరేందర్, జి చెన్న కేశవులును ఎస్‌ఐ అభినందించారు.

భూ ఆక్రమణదారులను అడ్డుకున్న రైతులు

మోత్కూరు, డిసెంబరు 31: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో బిక్కేరు వాగు వెంట ఆక్రమణకు గురైన సుమారు తొమ్మిది ఎకరాల నది మింజుంలే ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులు సాగు చేసి వరి నాట్లు వేస్తుండగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోడ బాబూరావు, గుంటి ఆనందం, పలువురు రైతులు ఆదివారం అడ్డుకున్నారు. 2011లో కొందరు వ్యక్తులు ఆ ప్రభుత్వ భూమిని ఆక్రమించగా ఆ ప్రాంత రైతులు అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2012 జనవరిలో ఆ భూమి వద్దకు ఎవరూ వెళ్లవద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ అక్కడ ఆక్రమణదారులు వేసినబోరు, మోటారును సీజ్ చేశారు. భూమి వద్దకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరిక బోర్డు పాతించారు. అప్పటి నుంచి ఆ భూమి మీదికి ఎవరూ వెళ్లలేదు. ఇప్పుడు మళ్లీ ఆక్రమించి సాగు చేస్తుండగా డిసెంబరు 29న ఆ ప్రాంతరైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా పనులు ఆపకుండా ఆదివారం వరి నాటు వేస్తుండడంతో రైతులు వెళ్లి అడ్డుకుని పనులు నిలిపి వేశారు. అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు కోరారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ


భువనగిరిలో అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహిస్తున్న గురు స్వాములు


అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

భువనగిరి రూరల్, డిసెంబరు 31: హరిహరపుత్ర అయ్యప్పస్వామి మహాపడి పూజ వైభవంగా జరిగింది. స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం విశ్వరూప, ఎన్‌వీడి నాగేశ్వర్‌రావు మోహన్‌దాస్ గురుస్వాముల సమక్షంలో సావర్కార్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ డీఎస్పీ నళిని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిభావం అలవర్చుకున్నప్పుడే శాంతియుత సమాజం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకులు పోల శ్రీనివాస్‌గుప్త, బచ్చు నరేందర్, బచ్చు శ్రీనివాస్, కాలేరు లక్ష్మణ్, దూసరి చంద్రశేఖర్, చెన్న మహేష్, చెన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

మోటకొండూరు: మండలకేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో 41రోజులు దీక్షలు చేసిన అయ్యప్ప స్వాములు ఆదివారం శబరిమలకు బయలుదేరారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోహన్ గురుస్వామి అయ్యప్ప స్వాములకు ఇరుముడులు కట్టారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు భాస్కరుని రఘునాథరాజు, బచ్చ శ్రీశైలం, సిరబోయిన వెంకట్‌మల్లేష్, దయ్యాలపాండు, ఎగ్గిడి కృష్ణ, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, మొగిలిపాక గణేష్, నందాల మహేష్, వంగపల్లి మహేందర్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: అయ్యప్ప మాలాధారణ దీక్షతో హృదయం పవిత్రంగా మారుతుందని దివీస్ సంస్థ జీఎం పెండ్యాల సుధాకర్‌రావు అన్నారు. మండలం రోజులు అయ్యప్ప మాలాధారణ దీక్ష పూర్తి చేసుకున్న ఆయన ఆదివారం చౌటుప్పల్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఇరుముడి కట్టుకొని శబరిమలైకి 13వ సారి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బి. మరళి, అధ్యక్షుడు కె. భాస్కర్, రామాలయం మాజీ అధ్యక్షుడు డి. గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుర్వి నర్సింహగౌడ్, శంకర్, సాయిలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : విప్ బీర్ల


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, డిసెంబరు 31: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 49వ జిల్లాస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆలేరును అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉంచేందుకు కృషిచేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులకు దుస్తులతో పాటు రవాణా ఖర్చులను తానే భరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగయ్య, కౌన్సిలర్ గుత్త శమంతారెడ్డి, మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్‌రావు, ఎంఏ. ఎజాజ్, నీలం పద్మ, వెంకటస్వామి, ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ ఆరె ప్రశాంత్, కుమార్, శ్రీకాంత్, బాబా, జైనుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు, మధుసూదన్, మల్లేశ్, కొండల్, చందర్, మల్లేశం, కృష్ణ పాల్గొన్నారు.

మద్యాన్ని అరికట్టి గ్రామాన్ని కాపాడుకుంటాం


నినాదాలు చేస్తున్న కొత్తగూడెం గ్రామ మహిళలు

సంస్థాన్ నారాయణపురం డిసెంబరు 31: మద్యాన్ని అరికట్టి గ్రామాన్ని కాపాడుకుంటామని మండలం కొత్తగూడెం గ్రామ మహిళలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం 'మద్యాన్ని అరికడదాం.. గ్రామాన్ని కాపాడుదాం' అనే కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మద్యానికి ఎవరూ బానిస కాకుండా బెల్ట్‌షాపులు నిషేదించాలని నినాదాలు చేశారు. మద్య నిషేద గ్రామంగా మారుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 31: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొని గెలిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీరిక సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ జక్కిడి రాంరెడ్డి, నాయకులు రాగీరు కిష్టయ్య, తడక మోహన్, బోయ యాదయ్య, కొండే శ్రీశైలం, పల్లె మధు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

గ్రామాలకు బస్సు సర్వీసులు నడపాలి : సీపీఎం

భువనగిరి రూరల్, డిసెంబరు 31: మారుమూల గ్రామాల్లో ఆర్టీసీ సేవలను మెరుగు పర్చి కొత్త బస్సు సర్వీసులు నడపాలని సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. మండలంలోని ముస్త్యాలపల్లి బస్టాండ్ వద్ద ఆదివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి నుంచి మోత్కూరు వైపు వెళ్తున్న బస్సులను ముస్త్యాలపల్లి బస్టాండ్ వద్ద ఆపకపోవడంతో విద్యార్థులు, వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఆయా మార్గాల గుండా వెళ్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసులను ముస్త్యాలపల్లి, చీమలకొండూర్ బస్‌స్టాప్‌ల వద్ద బస్సులు ఆపే విధంగా చూడాలన్నారు. గంటపాటు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు అక్కడికి చేరుకొని రాస్తారోకో విరమింపజేయించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనర్సయ్య, పి పరమేష్, కిష్టయ్య, చంద్రయ్య, మధు, సల్మాన్, రాములు, జగతి తదితరులు ఉన్నారు.


రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

రాజ్యాధికారం కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మోత్కూరు, డిసెంబరు 31: రాజ్యాధికార సాధన కోసం బీసీలు ఐక్యంగా పోరాడాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం మోత్కూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారుతున్నా బీసీల తలరాతలు మాత్రం మారడం లేదన్నారు. అగ్రవర్ణాల నాయకులు రాజకీయాల్లో బీసీలను పావులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లోనైనా బీసీలంతా ఐక్యంగా ఉండి బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, గుండగోని రామచంద్రు, ఎడ్ల శ్రీనివాస్, పురుగుల నర్సింహ, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, నిలిగొండ మత్స్యగిరి, బొడ్డుపల్లి మైసయ్య, బుర్ర సంతోష్, వంగరి రాములు, బాబుచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మోత్కూరు: హైదరాబాద్‌లో శనివారం రాత్రి నిర్వహించిన ఫిలిం ఫెస్టివల్ అవార్డుల ప్రదానోత్సవంలో మోత్కూరు ప్రజా భారతి సాహితీ, సాంస్కృతిక సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్ఎన్ చారి, మాజీ అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ప్రతినిధులు బి.హన్మంతు, ఎస్. భాస్కరాచారి, మోత్కూరు బ్రహ్మాచారిలను సన్మానించారు. మో త్కూరుకు చెందిన సినీదర్శకురాలు సూరోజు మంజులను బాహుబలి చిత్ర కథా రచయిత విజయేంద్రప్రసాద్ సన్మాంచారు.

చౌటుప్పల్ టౌన్: నూతన సంవత్సరంలో సుఖ శాంతులతో జీవించాలని చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య ఆకాంక్షించారు. సామాజిక కార్యకర్త దబ్బేటి శంకర్ రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్‌లో సీఐ దేవేందర్‌తో కలిసి ఏసీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడిటేషన్ సెంటర్ నిర్వహకురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా చౌటుప్పల్‌లోని అమ్మా నాన్న అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు సుర్వి సూర్య, శ్రీనువాస్, రామకృష్ణ, శివసాయి, నరేందర్ ఉన్నారు.

వలిగొండ : మండలంలోని టేకుల సోమారం గ్రామంలోని మానసిక దివ్యాంగులకు మార్కెట్ చైర్మన్ పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు అభిషేక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): భగవద్గీతను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదవాల్సిన గ్రంథం అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పంచాక్షరి అన్నారు. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇతర రచనల గురించి ఆదివారం మండలంలోని, ఉప్పలపహడ్, మోదుబాయిగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. భగవద్గీత జ్ఞానం తెలుసుకోవడం ద్వారా జ్ఞానాచరణ సాధ్యపడుతుందని, దాని ద్వారా యోగమాచరించి కర్మలను తెలుసకొని మనిషి మోక్షం పొందే అవకాశముందని ప్రబోధానంద స్వామి చెప్పినట్లు సభ్యులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు శ్రీనాథ్, అశోక్, యాదగిరి, బబ్లు, సాయిరాజ్, ఏపేందర్, లింగస్వామి, ప్రసాద్, రాము, లత, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామంలో ఏర్పాటు చేసిన అంగడి(సంతను) సర్పంచ్ సామల భాస్కర్ ప్రారంభించారు. గ్రామంలో ప్రజల అవసరాల రీత్యా ఇతర గ్రామాలకు వెళ్లి వస్తువులు, సరుకులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మర్రి వసంత, వార్డు మెం బర్లు బండమీది కృష్ణవేణి కిరణ్‌కుమార్, సుక్క జయమ్మ అబ్బ య్య, పిట్ట రామచంద్రం, కొత్త శ్రీకాంత్, దోటి లింగయ్య, మర్రి జయమ్మ జంగారెడ్డి, ఐతరాజు రాములు, పిట్ట చంద్రయ్య, మాధవరెడ్డి, చిలువేరు జంగయ్య, దేప విప్లవరెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: శ్రీకర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భువనగిరిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, నిర్ధారణ అయ్యాక తీసుకోవాల్సిన వైద్య చికిత్సలు, మందులపై అవగాహన కల్పించారు. డాక్టర్ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ అరుణదేవి నేతృత్వంలోని వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంగరెక్క స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని హైస్కూల్ 1996-97 బ్యాచ్ చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థిని ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో ఆమెతో పాటు చదువుకున్న విద్యార్థులు అండగా నిలిచారు. ఆమెకు ఆదివారం రూ.33 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెరకు విష్ణు, కోరె బీరప్ప, మహాలక్ష్మీ, నాగం వెంకట్‌రెడ్డి, నాగం సత్తిరెడ్డి, స్కైలాబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాల్కంబ్ జాతీయ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 31: చౌటుప్పల్ పట్టణంలోని త్రీనిటీ విద్యాల యానికి చెందిన ఆరుగురు విద్యార్థులు మాల్కంబ్ క్రీడా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం చారుగొండలో డిసెంబరు 29న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో త్రీనిటీ విద్యాలయానికి చెందిన 21మంది విద్యార్థులు పాల్గొనగా, ఆరుగురు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14-17 విభాగంలో బాలికలు కె. అక్షిత, కె. చిత్రాక్షి, ఎం. లోహిత, ఎం. సహస్ర, బాలుర విభాగంలో ఎస్. హేమంత్, ఎస్. శ్రీహర్ష జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరు 2024 జనవరి 7 నుంచి 12 వరకు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని త్రీనిటీ విద్యాలయం చైర్మన్ కేవీబీ కృష్ణారావు, మేనేజింగ్ డైరెక్టర్ వి. మంజుల తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు..


విద్యార్థులతో ఉపాధ్యాయులు

బీబీనగర్, డిసెంబరు 31: మండలానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో, వెంకిర్యాలలోని సాయి మొహిత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పంజాల వశిత్‌గౌడ్, ఎం. వెన్నలశ్రీ, జి. సుష్మ, పి. తేజస్విని ఈ నెల 28, 29, 30, 31వ తేదీల్లో వరంగల్, కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో అండర్ -17,19 విభాగాల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా జనవరిలో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీల్లో పాల్గొననున్నట్లు ఉమ్మడి నల్లగొండ ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి షేక్ పర్వేజ్ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 31: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఎనిమిదో నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్-2023లో జిల్లాకు క్రీడాకారులు ప్రతిభ చాటారు. 40ఏళ్ల కేటగిరి అథ్లెటిక్స్‌లో అంబోజు అనిల్‌కుమార్ రెండు బంగారు పతకాలు, కాంస్య పతకం సాధించారు. దొడ్ల విజయ రజత పతకం సాధించారు. 50ఏళ్ల కేటగిరిలో భువనగిరికి చెందిన గోనూరు శ్రీనివాస్ బంగారు, రజత పతకాలు సాధించారని యువజన, క్రీడల అధికారి ధనుంజనేయులు తెలిపారు.

కరాటే పోటీల్లో మోత్కూరు విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో బెల్టులు సాధించిన విద్యార్థులు

మోత్కూరు, డిసెంబరు 31: మోత్కూరులోని సాయి చైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో షిటూరియో ఇంటర్నేషన్ కరాటే డూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో ఆ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పలు రకాల బెల్టులు సాధించారని సీనియర్ కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్ తెలిపారు. జె.శివ, డి.కృష్ణసాయి బ్రౌన్ బెల్టులు, కె. క్రితిక్‌రెడ్డి, ఎం. మనుతేజ్, ఇ. అఖిల్‌తేజ్, ఆర్. విక్రాంత్, ఒ. మానస, జి. మౌనిక, ఒ. వైష్ణవి ఆరెంజ్ బెల్టులు, పి. ప్రత్తిక్ష, పీవీ. దీక్ష, జె.రక్షణ, ఎస్. సాత్విక, ఎ. రాకేష్, బి. నక్షత్‌రెడ్డి, జె. చందు, సీహెచ్. హరికృష్ణ, ఎ. శివశంకర్ ఎల్లో బెల్టులు సాధించారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బి. రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయలు అభినందించారు.

భువనగిరి నుంచి పోటీ చేస్తాం

● సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి టౌన్, డిసెంబరు 31: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి సీపీఐ పోటీలో ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు తెలిపారు. భువనగిరిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గంలో సీపీఐకి బలమైన క్యాడర్, ఓటు బ్యాంక్ ఉందని తెలిపారు. సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి, ధర్మభిక్షం, సూరవరం సుధాకర్‌రెడ్డి తదితర అగ్రనేతలను చట్ట సభలకు పంపిన ఘనత ఈ ప్రాంతవాసులదని తెలిపారు. ఆ వారసత్వాన్ని కొనసాగించేందుకు సీపీఐ బరిలో ఉండనున్నదన్నారు. పోటీపై పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయమే శిరోధార్యమన్నారు. బీజేపీ ఓటమే లక్ష్యంగా ప్రజాస్వామిక పార్టీలతో కలిసి పని చేస్తామన్నారు.

టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా సత్తయ్యగౌడ్

వలిగొండ, డిసెంబరు 31: టెలికాం అడ్వైజరీ బోర్డు జిల్లా సభ్యుడిగా మండలకేంద్రానికి చెందిన దంతూరి సత్తయ్యగౌడ్ నియా మకమయ్యారు. తన సేవలను గుర్తించిన బీజేపీ టెలికాం అడ్వైజరీ బోర్డు కమిటీ సభ్యుడిగా నియమించిందని సత్తయ్యగౌడ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్జీవో జిల్లా జాయింట్ సెక్రటరీగా అఫ్సాన్

భువనగిరి అర్బన్, డిసెంబరు 31: రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగుల సెంట్రల్ యూనియన్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎం.డీ. అఫ్సాన్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం భవనంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ ఆదివారం నియామక పత్రం అందజేశారు. అఫ్సాన్ జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి కార్యాలయంలో సబార్డినేటర్‌గా పని చేస్తున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, గౌరవాధ్యక్షుడు ఖాదర్ బిన్ హసన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కుంభంను కలిసిన ఎన్ఆర్ఐ పైళ్ల మల్లారెడ్డి


ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎన్ఆర్ఐ మల్లారెడ్డి

వలిగొండ, డిసెంబరు 31: భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని ఎన్ఆర్ఐ డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి హైదరా బాద్‌లో ఆయన నివాసంలో మర్యా దపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్చం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట పైళ్ల మల్లారెడ్డి కుమారుడు సాకేత్‌రెడ్డి, వెంకటేశ్వర సాంఘీక సంక్షేమ సేవా సమితి సుంకిశాల సమితి సభ్యులు పైళ్ల ఉపేందర్‌రెడ్డి, పెద్దలు సంజీవరెడ్డి, తదితరులు ఉన్నారు.